క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి నీలిమ, తదితరులు

పూసపాటిరేగ: మండల పరిధిలోని రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. నీలిమ అన్నారు. మండలంలోని కనిమెల్లలో శుక్రవారం నిర్వహించిన ఈకేవైసీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, మండల పరిధిలో 4,603 ఎకరాలలో సాగు జరుగుతోందన్నారు. ఈకేవైసీ నమోదు చేయంచకపోతే బీమా, ధాన్యం కొనుగోళ్లు వర్తించవని చెప్పారు. ఇప్పటికే 50 శాతం ఈకేవైసీ పూర్తయిందన్నారు. మిగతా రైతులు ఈనెల 9వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ అభ్యర్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహిళా ప్రాంగణం సమీపంలోని ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఆర్గనైజేషన్, గాయత్రి ఆస్పత్రి, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ కంపెనీల్లో 106 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు జిల్లా వ్యాప్తంగా 187 మంది హాజరయ్యారని జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ తెలిపారు. ఇందులో 35 మంది సెకెండ్ రౌండ్ ఇంటర్వ్యూకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ రామాచారి, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ బ్రాంచ్ మేనేజర్ సురేష్‌రాజు, గాయత్రి హాస్పిటల్ అడ్మిన్ ఎం.యశ్వంత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యులుగా చేరి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యం, సూర్యారావు, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ




దసరా ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: విజయనగరం హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించారు. శుక్రవారం తన నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కోలగట్ల మాట్లాడుతూ, అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపైనా ఉండాలన్నారు. ఏటా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న హిజ్రాల ప్రయత్నాన్ని అభినందించారు. హిజ్రాస్ అసోసియేషన్ ప్రతినిధి కొండబాబు మాట్లాడుతూ, నగరంలోని పెద్ద చెరువు గట్టుపై గల వైఎస్సార్ సర్కిల్ వద్దనున్న శ్రీ విజయసాగర దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నామని, భక్తులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు మీనా, తదితరులు పాల్గొన్నారు..

సస్పెన్షన్ ఎత్తివేత

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని రామతీర్థం జంక్షన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి. జనార్దనరావుపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గత నెల 27న డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి ఆ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో పాఠశాలలో కనిపించిన లోపాలకు బాధ్యుడ్ని చేస్తూ హెచ్‌ఎంను సస్పెండ్ చేశారు. అయితే ఆ హెచ్‌ఎంను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సంబంధిత అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

జామి: కుమరాం గ్రామంలోని ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి శుక్రవారం సహస్రనామార్చన, ధూపసేవ, నక్షత్ర హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రజలే ప్రభుత్వానికి అండ..

- మళ్లీ జగనే అధికారంలోకి రావాలి
- ఈ నెల 11 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి'
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి రహిత పాలన వల్ల నేడు ప్రతి నాయకుడు, కార్యకర్త గర్వంగా తల ఎత్తుకుని తిరగగలుగుతున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రజలే మన ప్రభుత్వానికి అండ, రక్ష అని చెప్పారు. నగరంలోని 17, 20, 22, 22, 23, 24, 25, 48, 49, 50 డివిజన్‌లకు సంబంధించిన క్లస్టర్ స్థాయి సమావేశం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మంటపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి అంశంపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 11 నుంచి ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ పాలన వైఫల్యాలను.. జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజలకు వివరించడంతో పాటు ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల వల్ల మధ్యలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడూ ఆపలేదని గుర్తు చేశారు. తాము అమలు చేస్తున్న పథకాలను ఓవైపు విమర్శిస్తూనే.. మరోవైపు టీడీపీ వారు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో వాటినే అనుకరించడం ఏమిటని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిలిపివేస్తామని చెబుతూ ప్రజల వద్దకు తెలుగుదేశం పార్టీ నాయకులు వెళ్లి ఓట్లు అడగగలరా? అని ప్రశ్నించారు. ఏదో ఒక నెపంతో ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొన్ని మీడియా సంస్థలను అడ్డం పెట్టుకుని దుష్ప్రచారానికి దిగుతున్నారని, వీటిని వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకొని వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. గతంతో పోల్చుకుంటే ఈ నాలుగేళ్లలో నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా కోలగట్ల అండగా ఉంటారని.. అర్ధరాత్రి అయినా తన ఇంటి తలుపు తట్టవచ్చని తెలిపారు. కరోనా సమయంలో ఎవరు తమకు అండగా నిలిచారో ప్రజలు గమనించారని, అందుకే కార్పొరేషన్ ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీ ఇచ్చారని గుర్తు చేశారు. తాను ఒక సామాన్య కార్యకర్త నుంచి ఈ స్థాయికి రావడానికి ప్రజల అండదండలే కారణమన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటే సంక్షేమ పాలన కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరించాలి..

- నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లిమర్ల నగర పంచాయతీలో త్వరలో నిర్వహించనున్న 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందని పట్టణవాసులకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు మద్దిల వాసు, నౌపాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపకులు ఉపాధ్యాయులు



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

విజయనగరం: ఉపాధ్యాయులు సమ సమాజ స్థాపకులని జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తోటపాలెం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసవీమాత చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాటి రాజుల కాలం నుంచి గురువుకు మొదటి స్థానం కల్పించారన్నారు. గురువు నుంచే జ్ఞానం అనే సంపదను ప్రతిఒక్కరూ సంపాదించాలని సూచించారు. ఈ సందర్భంగా 12 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. సంఘ అధ్యక్షుడు ఆకి సూర్యప్రకాశరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు ఏడుకొండలు, కార్యదర్శి మండవిల్లి కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి కె.తిరుపతిరావు, ఉసిరికల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎ.డి చంద్రరావు

నెల్లిమర్ల: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఎ.డి కె. చంద్రరావు హెచ్చరించారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలు మన గ్రోమోర్ సెంటర్, శ్రీనివాస ట్రేడర్స్‌లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, లైసెన్స్‌లు, ఈపోస్ మెషీన్ నిల్వలు, బిల్లు బుక్‌లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి ఎం. పూర్ణిమ, ఏఈఓ ఎం.నాగరాజు పాల్గొన్నారు.

సీతం కళాశాల విద్యార్థుల పారిశ్రామిక సందర్శన



రాడార్ స్టేషన్‌లో విద్యార్థులు

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ చివరి సంవత్సర ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా విశాఖలోని డాప్లర్ వెదర్ రాడార్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాడార్ స్టేషన్ జనరల్ మేనేజర్ దీప్‌కరణ్ సింగ్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త రాబిన్ షా యాదవ్ రాడార్ రేడియో తరంగాలపై అవగాహన కల్పించారు.

నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: శిక్షణలో నేర్చుకున్న సాంకేతికతతో కూడిన నైపుణ్యాలను ఉపాధి సమకూర్చుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) నోడల్ అధికారి డి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఆర్‌కే టౌన్‌షిప్‌లోని జీఎంఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణ కేంద్రంలో మూడు నెల ఉచిత మోటార్ వైండింగ్ శిక్షణ కోర్సు ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ అందించిన ఎలక్ట్రికల్ పరికరాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.జయకుమార్, అసోసియేట్ మేనేజర్ సీహెచ్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జ్ కేవీ రమణ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పౌష్టికాహార ప్రదర్శనలు



పౌష్టికాహార పదార్థాలను రుచి చూస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పౌష్టికాహార ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో భాగంగా ఆయా సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు సాధారణంగా అందుబాటులో ఉన్న వస్తువులతో తయారు చేసిన పదార్థాలను అవగాహన కోసం ప్రదర్శనలో ఉంచుతున్నారు. ఇవి చాలా రుచిగా, పోషక విలువతో కూడిన విధంగా ఉండడంతో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గుణుపూరుపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, ఇతర ప్రజాప్రతినిధులు తిలకించి, ఆహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, భోగాపురం ఐసీడీఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు నియామకపత్రం అందజేత

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని మొయిద జంక్షన్–1 సచివాలయం మూడో వార్డు వలంటీర్‌గా నియమితులైన పాలూరి శ్రీనివాసరావుకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని శుక్రవారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మొయిద శ్రీనివాసరావు, మైపాడ ప్రసాద్, నాయకులు బంగారు శంకరరావు, పైల మురళి, తదితరులు పాల్గొన్నారు.

'జేఏఎస్'ను వినియోగించుకోవాలి



బొప్పడాం ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. మండలంలోని బొప్పడాం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి శనివారం జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శిబిరానికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి శిబిరానికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు సాయినందిని, సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం : వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



డెంకాడ: గుణుపూరుపేటలో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ



పూసపాటిరేగ: కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు



భోగాపురం: మందులను పరిశీలిస్తున్న సీఎం కార్యాలయ ప్రతినిధి ఆర్. ముత్యాలరాజు, కలెక్టర్ నాగలక్ష్మి

వియనగరం: ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 8, 9, 10, 33, 34 సచివాలయాల పరిధిలో గల ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. నగరంలో ఇప్పటివరకు 15 సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించగా.. మొత్తం 2,290 మంది వినియోగించుకున్నారు. తొలిరోజు 661 మంది, తర్వాత 829 మంది, శుక్రవారం 800 మంది ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, ప్రజలందరూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం మందుల పంపిణీపై ఆరా తీశారు. స్థానిక కార్పొరేటర్లు జాకీర్ హుస్సేన్, దుప్పాడ సునీత, పొంతపల్లి మాలతి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ఆయన వేస్తున్న అడుగులు అభినందనీయమన్నారు. ఒకవైపు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే మరోవైపు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, ఎస్. బంగారునాయుడు, రెడ్డి గురుమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శిబిరాలను వినియోగించుకోవాలి

భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రతినిధి ఆర్. ముత్యాలరాజు, కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. మండలంలోని రామచంద్రపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన ప్రజలతో మాట్లాడుతూ, వైద్యసేవలపై ఆరా తీశారు. నేరుగా శిబిరం వద్దకు వచ్చే వారికి కూడా టోకెన్లు జారీ చేసి ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఏడు రకాల వైద్య పరీక్షలు ఇంటి వద్దే నిర్వహించి, కేస్‌షీట్లు రూపొందించాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి శిబిరంలోనూ పీహెచ్‌సీ వైద్యులతో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. మొత్తం 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక పట్టికను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ, లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తర్వాత ఐరన్ మాత్రలు వేయించాలని హెచ్‌ఎం వై. విజయలక్ష్మిని ఆదేశించారు. మండలంలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.. కేంద్రాల్లో ఎంతమంది చిన్నారులు ఉన్నారు.. వారికి సక్రమంగా పౌష్టికాహారం అందిస్తున్నారనా, లేదా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యకళ, మండల ప్రత్యేకాధికారి సుధారాణి, జిల్లా వైద్యాధికారి రామారావు, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ దుక్క గౌరి, దుక్క అప్పన్న, పడాల భాను, దుక్క రమణ, వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం..

పూసపాటిరేగ: ప్రజారోగ్య సంరక్షణే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయయని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు విస్తరించారని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కుమిలి సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 580 మంది వైద్యసేవలు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలు ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందన్నారు. గ్రామాలలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో నిపుణులైన వైద్యులతో సేవలందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, ఎంపీడీఓ ఎం. రాధిక, ఐసీడీఎస్ పీఓ ఎస్తేరురాణి, వైస్ సర్పంచ్ గుజ్జు సురేష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పిన్నింటి ఎల్లంనాయుడు, గాబు సూరప్పన్నరెడ్డి, లండ పాపారావు, పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారనిఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గుణుపూరుపేట గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలందరికీ వైద్యసేవలు అందించడంతో పాటు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యానికి రిఫర్ చేస్తున్నారన్నారు. వైద్యులు మోనిక, మనోజ్, భవానీ, యోగితాబాల, సిబ్బంది రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండలక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ స్వరూపారాణి, సర్పంచ్‌లు పైల ముత్యాల నాయుడు, అట్టాడ శివకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బుజ్జిరాజు, మండల సత్యం, బడుకొండ చిన్న, రాము నాయుడు, సచివాలయ అధికారులు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

